క్లుప్తంగా

మల్లన్న స్వామి జాతర ఉత్సవాలు



మల్లన్న స్వామికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మార్డిలో శనివారం మల్లన్న స్వామి జాతర ఉత్సవాలు నిర్వహించారు. మల్లన్న స్వామికి గంగ విశేష పూజలు తదితర కార్యక్రమాలు చేపట్టారు. నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి హాజరై ప్రత్యేకంగా పూజలు చేశారు. కార్యక్రమంలో ఆత్మ మాజీ చైర్మన్ రాంసింగ్, మాజీ జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, నాయకులు ఎస్.జనర్ధన్, కుమ్మరి శ్రీనివాస్, సుధాకర్ పాల్గొన్నారు.

కార్మికుల హక్కులపై దాడి హేయం



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

నారాయణఖేడ్: కార్మిక, ఉద్యోగుల హక్కులపై ప్రభుత్వాల దాడిని ఐక్యంగా ప్రతిఘటించాల్సిన అవసరం ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు పాలడుగు భాస్కర్ అన్నారు. ఖేడ్‌లో శనివారం ప్రభుత్వాల విధానాలు–కార్మికులు, ఉద్యోగులపై ప్రభావం' పై సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, ఉద్యోగుల హక్కులపై తీవ్రమైన దాడి చేస్తోందన్నారు. లేబర్ కోడ్ తెచ్చి సంఘాలు, సమ్మె హక్కులు లేకుండా చేస్తోందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు అతిమెల మాణిక్, ఖేడ్ ప్రాంత కార్యదర్శి రమేశ్, సభ్యులు సతీశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు రాష్ట్ర సైన్స్ సెమినార్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: తెలంగాణ రాష్ట్ర విద్య వైజ్ఞానిక శిక్షణ, పరిశోధన సంస్థ (ఎస్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలో 'మన ప్రపంచంలో సైన్స్ అనే అంశంపై ఉపాధ్యాయ, అధ్యాపకులకు రాష్ట్ర సైన్స్ సెమినార్ నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. 28 ఫిబ్రవరి, 2025న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పలు అంశాలపై రాష్ట్ర స్థాయి సెమినార్ కోసం, సైన్స్ ఉపాధ్యాయులు తమ సెమినార్ పత్రాలను జనవరి 20వ తేదీ వరకు సమర్పించాలని సూచించారు. వివరాలకు ఏఎంఓ అనురాధ 94400–32466, జిల్లా సైన్స్ అధికారి పి.సిద్దారెడ్డి 63022–90235 నంబర్‌లలో సంప్రదించాలన్నారు.

మాదకద్రవ్యాలను దరిచేరనివ్వొద్దు

సీఐ వినాయక్ రెడ్డి



మాట్లాడుతున్న పటాన్‌చెరు సీఐ వినాయక్ రెడ్డి

పటాన్‌చెరు: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సెల్‌ఫోన్‌లను పక్కన పెట్టి చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి చూపాలని పటాన్‌చెరు సీఐ వినాయక్ రెడ్డి అన్నారు. 'హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ ఆధ్వర్యంలో వారం రోజులుగా పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామంలో నిర్వహించిన డ్రగ్స్ నిర్మూలన క్యాంపు ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వర్సిటీ విద్యార్థులు తమ యొక్క విలువైన సమయాన్ని వెచ్చించి గ్రామంలో వారం రోజులుగా చేసిన పనిని అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలను ఇంకా కొనసాగించాలని కోరారు. గ్రామాలలోని యువత ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని, సమాజాభివృద్ధికి తమ వంతు సహాయాన్ని అందించాలన్నారు. గ్రామంలో ఐదుగురు విద్యార్థులు కిక్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సిల్వర్ మెడల్స్ సాధించిన వారిని, కోచ్‌లను సన్మానించి అభినందించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ 9వ వార్డు కేబీఆర్ కాలనీలో మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు మున్సిపల్ చైర్ పర్సన్ కొలన్ రోజాబాల్ రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. విడతల వారీగా మున్సిపల్ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బాల్ రెడ్డి, కౌన్సిలర్లు బీరప్ప యాదవ్, ఏఈ కిష్టయ్య, కాలనీవాసులు జనార్దన్, రవి, స్థానికులు పాల్గొన్నారు.

ఫుడ్.. ఫెస్టివల్

నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాలలో శనివారం 'ఫుడ్ ఫెస్టివల్' నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసుకొని తెచ్చిన రకరకాల వంటలను ప్రదర్శించారు. పౌష్టికాహారంతోనే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని ప్రధానోపాధ్యాయుడు పోట్రు రామకృష్ణ అన్నారు.

– సదాశివపేట రూరల్(సంగారెడ్డి):



వంటలు, ఫలాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ప్రశాంతతకు ధ్యానం



ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పట్టణంలోని మాణిక్‌ప్రభు పాఠశాలలో శనివారం నిర్వహించారు. ధ్యాన గురువు డాక్టర్ నరేందర్ విద్యార్థులకు ధ్యానం వల్ల కలిగే లాభాలను తెలిపారు. ధ్యానం వల్ల ప్రశాంతత లభిస్తుందన్నారు. రోజూ ధ్యానం చేయాలన్నారు. రోజూ చేయడం వల్ల సాధన చాలా సులభమవుతుందన్నారు.

– జహీరాబాద్ టౌన్:

ఆహ్లాదం కరువు

పట్టణ ప్రకృతి వనం నిరుపయోగంగా మారింది. గత ప్రభుత్వం పల్లె వాతావరణం కనిపించాలనే ఉద్దేశంతో హరితహారం కార్యక్రమంలో భాగంగా అర్బన్ ఏరియాల్లో ఏర్పాటు చేసింది. అప్పట్లో ఆహ్లాదం పంచగా నేడు ఎక్కడ చూసినా అపరిశుభ్రతే దర్శనమిస్తోంది. అధికారుల నిర్లక్ష్యమే కారణమని కాలనీ వాసులు విమర్శిస్తున్నారు.

- నిరుపయోగంగా మారిన పట్టణ ప్రకృతి వనం
- పట్టించుకోని అధికారులు

సంగారెడ్డి టౌన్: పట్టణంలోని 10వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో పట్టణ ప్రకృతి వనం ఏర్పాటైంది. మొదట్లో చిన్నారులు ఆడుకునేందుకు వస్తువులు, పెద్దలు వాకింగ్, జాగింగ్ చేయడానికి నడక దారి ఏర్పాటు చేశారు. ఉదయం సాయంత్రం సమయాల్లో జనంతో వనం కళకళలాడుతుండేది. వృద్ధులు కూడా కొంత సేపు సేదతీరేవారు. పలువురు యోగాసనాలు వేసుకునేవారు. ప్రస్తుతం వనం నిర్వహణ అధ్వానంగా ఉంది. పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది. పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నది. అయినా గానీ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోయారు. ఇప్పటికైనా వినియోగంలోకి తేవాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.



సంగారెడ్డి పట్టణం పదో వార్డులో ఉన్న ప్రకృతివనంలో పేరుకు పోయిన చెత్తాచెదారం



ప్రకృతి వనం ముఖద్వారం

అన్నివర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



క్రైస్తవ పెద్దలతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: కులమతాలు ఏవైనా లోకకల్యాణమే ప్రతీఒక్కరి అభిమతం కావాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. ఖేడ్‌లోని సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వపరంగా సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. క్రైస్తవ పెద్దలతో కలిసి ఆయన కేక్ కట్‌చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని కుల మతాలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కులం, మతం ఏదైనా ప్రతీఒక్కరు సోదరభావంతో మెలగాలన్నారు. ఏసుక్రీస్తు లోకకల్యాణం కోసం పాటుపడ్డారన్నారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఆర్డీఓ అశోకచక్రవర్తి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, క్రైస్తవ పెద్దలు అమృత్, దేవదాస్, సామేల్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు తాహెర్‌అలీ, మాజీ ఎంపీటీసీలు ముంతాజ్, శంకర్ ముదిరాజ్, నెహ్రూనాయక్, వివిధ గ్రామాల పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

విజయవంతంగా క్రీడా పోటీలు



వాలీబాల్ ఫైనల్స్‌లో తలపడుతున్న ఇరు జట్లు

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని ఎద్దుమైలారం ఆయుధ కార్మాగారం (ఓడీఎఫ్)లో ఆర్మర్డ్ వెహికిల్స్ నిగమ్ (ఏవీఎన్ఎల్) చైర్మన్ కప్ క్రీడా పోటీలు శనివారం విజయవంతంగా ముగిశాయి. గెలుపొందిన జట్లకు కంపెనీ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్ఎస్ ప్రసాద్, హెచ్ఆర్ జనరల్ మేనేజర్ పట్నాయక్ ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో దేహదారుఢ్యంతో పాటు ఉద్యోగులు ,కార్మికుల్లో ఐక్యత ఏర్పడుతుందన్నారు. ఈ టోర్నీలో వాలీబాల్, బాస్కెట్ బాల్, క్రికెట్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఫైనల్స్ పోటీలో క్రికెట్‌లో ఓడీఎఫ్ మెదక్ జట్టు, బాస్కెట్ బాల్‌లో వెహికిల్ ఫ్యాక్టరీ జబల్ పూర్, వాలీబాల్‌లో హేవీ వెహికిల్ ఫ్యాక్టరీ ఆవడీలు విజేతలుగా నిలిచాయన్నారు.

బాలికల అభివృద్ధికి తోడ్పాటు అందించాలి



ఉపాధ్యాయులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న లలిత కుమారి

జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారి లలితకుమారి

నారాయణఖేడ్: బాలికల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి అన్నారు. ఖేడ్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, నాగల్‌గిద్ద కేజీబీవీ పాఠశాలలో శనివారం బేటీ బచావో.. బేటీ పఢావో కార్యక్రమాలను నిర్వహించారు. అందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. .బాలల హక్కులు, చట్టాలు, బాల్యవివాహాలు, బాలల అక్రమ రవాణాల వల్ల కలిగే అనర్థాలను తెలిపారు. బాలికల విద్య, మహిళా సమానత్వం, సాధికారితను గురించి ఖేడ్ ఆర్డీఓ అశోక చక్రవర్తి అవగాహన కల్పించారు. అనంతరం ఖేడ్ మండలం అనంతసాగర్ అంగన్‌వాడీ కేంద్రం, చైల్డ్ హోంలను తనిఖీ చేశారు ఖేడ్ సీడీపీఓ సుజాత, జిల్లా మహిళా సాధికారిత కేంద్రం సమన్వయకర్త పల్లవి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాల్సిందే



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సీఐటీయూ ఖేడ్ డివిజన్ కార్యదర్శి రమేశ్

నారాయణఖేడ్: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించడంతోపాటు కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని సీఐటీయూ ఖేడ్ డివిజన్ కార్యదర్శి రమేశ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయా డిమాండ్లతో పంచాయతీల కార్మికులు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్మికుల వేతనాలు ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీఓ అశోకచక్రవర్తికి అందజేశారు. సంఘం డివిజన్ నాయకులు సతీశ్, శకుంతల, కుమార్, సిద్దమ్మ, రాజు, నాగన్న, సుధాకర్, ఏసు, సుశీల, సాయిలు, లక్ష్మయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

సవాళ్లను అధిగమిస్తేనే విజయాలు



కరస్పాండెంట్ రవి

పటాన్‌చెరు: గొప్ప విజయాలు సాధించే క్రమంలో ఎన్నో అవాంతరాలు ఎదురవుతుంటాయని, వాటిని ఓపికగా అధిగమిస్తేనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలమని విశ్వభారతి లా కాలేజీ కరస్పాండెంట్ రవి అనంత అన్నారు. ప్రతీ ఒక్కరి జీవితంలోనూ ఎన్నో ఆటుపోట్లు సహజమన్నారు. మనకు ఎదరయ్యే అడ్డంకులను విజయ సోపానాలుగా మార్చుకొని ముందడుగు వేయాలన్నారు. పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని విశ్వభారతి లా కాలేజీలో 'ఫ్రెషర్స్ డే' వేడుకలు శనివారం జరిగాయి. కార్యక్రమానికి రవి అనంత ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఓటమికి కుంగిపోకుండా ధైర్యంగా ముందడుగు వేసిన వారే జీవితంలో గొప్ప స్థాయికి చేరుకుంటారన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. మెరుగైన సమాజ స్థాపనలో న్యాయవాదుల పాత్ర అత్యంత కీలకమన్నారు. ఎప్పటికప్పుడు కొత్త విషయాలను తెలుసుకుంటూ నిరంతర విద్యార్థిగా ఉన్నవారికి అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయన్నారు. చదువుతోనే ఉన్నత స్థానాలకు ఎదగొచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భవాని, ఫ్యాకల్టీ సభ్యులు తేజశ్రీ, అన్వీ, కీర్తి, రమ్యశ్రీ పాల్గొన్నారు.

డీసీఎం ఢీకొని వృద్ధుడి మృతి

పటాన్‌చెరు టౌన్: డీసీఎం ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. ఈ సంఘటన పటాన్ చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఆసిఫ్ తెలిపిన వివరాల ప్రకారం... పటాన్‌చెరు జాతీయ రహదారి నుంచి మార్కెట్ యార్డుకు వెళ్లే రహదారిలో గుర్తుతెలియని వృద్ధుడి(60)ని డీసీఎం ఢీకొంది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



సంగారెడ్డి జోన్: పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సంగారెడ్డి జోన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ 2024 రాష్ట్రసాయి క్రీడా పోటీలకు జిల్లా గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కేపీ నిరీక్షణరావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో నిర్వహించిన జిల్లాస్థాయి వివిధ క్రీడా పోటీల్లో ఏ.వరప్రసాద్, చంటి, ఆకాశ్, కే వినయ్ కుమార్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వెల్లడించారు. ఈనెల 27 నుంచి జనవరి 2వ తేదీ వరకు వరంగల్‌లో జరిగే ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎంపిక కావడం పట్ల కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జయపాల్ సింగ్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

ఝరాసంగం(జహీరాబాద్): 'సీఎం కప్ –2024 క్రీడా పోటీల్లో ఝరాసంగం మోడల్ స్కూల్, విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబర్చి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల 10వ తరగతి విద్యార్థి ఇస్మాయిల్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపిక కాగా, జిల్లాస్థాయి కరాటేలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న స్నేహ రెడ్డి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తేనావతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు అభినందించి, రాష్ట్రస్థాయిలో విద్యార్థి రాణించాలన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు..

మునిపల్లి(అందోల్): జిల్లా సీఎం కప్ పోటీల్లో బుదేరా మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు సత్తా చాటారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జి. రమాదేవి తెలిపారు. శనివారం మండలంలోని బుదేరా మహిళా డిగ్రీ కళాశాలలో వారు మాట్లాడుతూ, సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో ఈనెల 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలు జరిగాయన్నారు. అందులో విద్యార్థినులు ప్రభావతి, జెరుష, సౌజన్య, శారద, రాధిక, రూప, లక్ష్మి, కల్పన, సంధ్యలు పతకాలు సాధించారని తెలిపారు. తమిళనాడులో ఈనెల 24 నుంచి 27 వరకు జరిగే 46వ జూనియర్ నేషనల్ హ్యాండ్ బాల్ చాంపియన్ షిప్‌కు కల్పన ఎంపికై నట్లు రమాదేవి తెలిపారు.

ఘనంగా జగన్మోహన్‌రెడ్డి జన్మదినం



సంగారెడ్డి: వైఎస్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న నాయకులు



పటాన్‌చెరు టౌన్ : గణేశ్‌గడ్డ దేవస్థానంలో పూజలు చేసిన అభిమానులు

సంగారెడ్డి: వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బర్త్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడే వైఎస్సార్ అభిమానులు కేక్ కట్ చేశారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కావాలని కోరుకున్నారు. పటాన్‌చెరు టౌన్: ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం పటాన్‌చెరు మండలం చిట్కుల్‌కు చెందిన దప్పు రాజు మిత్ర బృందంతో కలిసి గణేశ్ గడ్డ దేవస్థానంలో వైఎస్ జగన్ పేరిట పూజలు నిర్వహించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జగన్ అభిమానులు పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంకుగా మీ ముందుకు



మహేందర్, ఏపీజీవీబీ బీఎం

కంగ్టి(నారాయణఖేడ్): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ జనవరి 1వ తేదీ నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకు(టీజీబీ)గా మార్పు చెంది సేవలు అందించనుందని శుక్రవారం తడ్కల్ ఏపీజీవీబీ మేనేజర్ కే మహేందర్ తెలిపారు. తెలంగాణలోని 493 ఏపీజీవీబీ బ్రాంచీలు హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా టీజీబీలో విలీనమవుతుందన్నారు. ఈనెల 28 నుంచి 31 వరకు బ్యాంకింగ్ సేవలు, ఆన్‌లైన్ సేవలు (యూపీఐ, ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్) అందుబాటులో ఉండవన్నారు. ఖాతాదారులు ఆర్థిక లావాదేవీలు ముందస్తుగానే జరుపు కోవాలని సూచించారు. ఏపీజీవీబీకి సంబంధించిన యాప్‌లు, ఫోన్ పే యాప్‌లు అన్‌ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. విలీనం అనంతరం మళ్లీ ఇన్‌స్టాల్ చేసుకోవాలని ఖాతాదారులను కోరారు.

మహాసభలకు తరలిరండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

నారాయణఖేడ్: నల్గొండలో నిర్వహించనున్న రాష్ట్ర 6వ మహాసభలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ సంఘం జిల్లా అధ్యక్షుడు కంబపురం అశోక్ కోరారు. ఖేడ్ మహాసభల పోస్టర్లను సంఘం నాయకులు ఉపాధ్యాయులతో కలిసి ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈనెల 28, 29, 30వ తేదీల్లో జరిగే మహాసభలకు ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో తరలి రావాలని కోరారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కాశీనాథ్ జాదవ్, జిల్లా కార్యదర్శులు యేశప్ప, నరేశ్, నర్సయ్య, హరిసింగ్, మండలాల బాధ్యులు జ్యోతి లింగం, రామ్ నాయక్, హనుమాండ్లు, మహేశ్, రవికుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **నాణ్యమైన భోజనాన్ని అందించాలి**



సంగారెడ్డి టౌన్: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సంగారెడ్డి ఎంపీడీఓ యాదగిరి అన్నారు. శనివారం సంగారెడ్డి మండలం కొత్లపూర్ గ్రామ శివారులోని జ్యోతిరావు పూలే బాలికల హాస్టల్‌ను సందర్శించారు. వారికి సరైన వసతులు ఉండేలా చూడాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి ఆయన భోజనం చేశారు. అలాగే పలు గ్రామాల్లో పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు.

◆ **రైతు దినోత్సవానికి తరలిరండి**

సంగారెడ్డి టౌన్: రైతు దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ మంజీరా రైతు సమైక్య అధ్యక్షుడు తుమ్మల పృథ్వీరాజ్ శనివారం సంగారెడ్డి పట్టణంలో తెలిపారు. ఈనెల 23న పోతిరెడ్డిపల్లిలోని రైతు వేదికలో రైతు దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

◆ **ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన**

కంగ్టి(నారాయణఖేడ్): ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును ఎంపీడీఓ సత్తయ్య శనివారం పరిశీలించారు. మండలంలోని గాంధీనగర్, సాధుతండా, జమ్గి(బీ), బాన్సువాడ, ముర్కుంజాల్, ఎడ్లరేగడితండా తదితర గ్రామ పంచాయతీలలో సర్వే చేస్తున్న తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. కాగా, ప్రజాపాలనలో 12,090 మంది ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకోగా ఇప్పుడు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

◆ **బీఆర్ఎస్‌లో చేరిక**

జిన్నారం (పటాన్‌చెరు): కాంగ్రెస్ గుమ్మడిదల మండలం సీనియర్ నాయకులు కందుగారి రాంరెడ్డి శనివారం ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్లో చేరారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఆయనకు గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఉద్యమ పార్టీలోకి సీనియర్ నాయకులు రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చకే చేరుతున్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దేవేందర్ రెడ్డి గ్రామ కమిటీ అధ్యక్షుడు దాసరి ఆంజనేయులు యాదవ్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, మల్లారెడ్డి, రాజీవ్ గౌడ్, రవి గౌడ్, యాదగిరి, పెంటయ్య, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

◆ **25న బజరంగ్‌దళ్ శౌర్య యాత్ర**

జోగిపేట(అందోల్): బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఈనెల 25న జోగిపేటలో భారీ శౌర్య యాత్ర నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రామ్ సింగ్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం అందోల్‌లో ఉన్న గరుడ ఆంజనేయస్వామి దేవాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బజరంగ్ దళ్ అఖిలభారత కన్వీనర్ నీరజ్ దునేరియా ఈ సభకు హాజరవుతున్నట్లు తెలిపారు. రెండు వేల మంది యువకిశోరాలతో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలాదిమంది హిందూ యువకిశోరాలతో త్రిశూల్ దీక్ష కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

◆ **పొదుపు సంఘాలకు రుణాలు ఇప్పించాలి**

కల్హేర్(నారాయణఖేడ్): మహిళా పొదుపు సంఘాలకు బ్యాంక్ లింకేజీ రుణాలు ఇప్పించాలని ఐకేపీ ఏపీఎం సాయిలు సిబ్బందికి సూచించారు. శనివారం కల్హేర్ ఐకేపీ కార్యాలయంలో సీసీలు, వీఓఏలతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఇప్పటికే తీసుకున్న బ్యాంక్ లింకేజీ రుణ వాయిదాల వసూలు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సీసీలు నర్సింహులు, సాయిలు, శారద, సిబ్బంది శోభన్ పాల్గొన్నారు.